నేడు ఉద్యమ సారథి ప్రొ. కోదండరాంకు
ఆత్మీయ పౌర సన్మానం



ముషీరాబాద్: మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూది.. జేఏసీ ఏర్పాటు చేసి దానికి కన్వీనర్‌గా బాధ్యత పోషించి.. పదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురై ఇటీవల ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన తెలంగాణ ఉద్యమసారథి, ప్రొ. కొదండరాంను ఈనెల 4న ఆత్మీయ పౌర సన్మానం చేయనున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కట్టమైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం కళాకారులు ఆయనకు స్వాగతం పలుకుతారని గ్రేటర్ హైదరాబాద్ టీజేఎస్ అధ్యక్షుడు నర్సయ్య తెలిపారు. ఈ ర్యాలీ త్యాగరాయ గానసభ వరకు కొనసాగుతుందన్నారు. త్యాగరాయ గాన సభలో జరిగే ఈ కార్యక్రమానికి ఉద్యమకారులు, ప్రజా సంఘాల నేతలు, టీజేఎస్ నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు..

అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలో జస్టిస్ రాధారాణి



ఆత్మీయ సత్కారం పొందిన వివిధ రంగాల ప్రముఖులతో జస్టిస్ రాధారాణి, చంద్రశేఖర్, నన్నపనేని రాజకుమారి, రాజ్యలక్ష్మి, వసుంధర, ఆమని

చిక్కడపల్లి: నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను మంగళవారం సాయంత్రం త్యాగరాయ గానసభలో ఘనంగా జరిగాయి. సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ రాగ సప్త స్వరం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో జస్టిస్ రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రమశిక్షణతోనే అక్కినేని నాగేశ్వరరావు సినీరంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని అన్నారు. సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చే సినిమాల్లో ఆయన నటించారని అన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల గ్రూప్ అధినేత నంగునూరి చంద్రశేఖర్, టీడీపీ నాయకురాలు నన్నపనేని రాజకుమారి, ప్రముఖులు రాజ్యలక్ష్మి, వంశీ రామరాజు, వసుంధర, ఆమని, బాలకామేశ్వరరావు, జర్నలిస్టులు రమణ, రమేష్‌బాబు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి



చికిత్స పొందుతున్న సంజయ్‌కుమార్‌ను కలిసిన దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీ కులగణన జరిపి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 9 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్‌ను కలిసి మద్దతు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్ష సమావేశం జరిపి వీలైనంత త్వరగా స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల పెంపు నిర్ణయం ప్రకటించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ప్రకటించినందున దీనిపై జాప్యం ఎందుకని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. లేని పక్షంలో బీసీ ఉద్యమం మరింత ఉధృతంగా మారి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై అన్ని రాజకీయ పార్టీలు స్పందించాలని ఆయన కోరారు.

గణేశ్ ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తొద్దు



సమావేశంలో కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి, డీఎంసీ మారుతీదివాకర్

అంబర్‌పేట: గణేష్ వేడుకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని భరత్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి గణేష్ ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు. విద్యుత్, పారిశుధ్యం, చెట్ల కొమ్మలు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్‌వో హేమలత, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల పనులు త్వరగా చేయించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న డీఈవో చిరంజీవి, ఐవోఎస్ స్వరూపారాణి

ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ విద్యా మండలి డిప్యూటీ ఈవో చిరంజీవి, ఐవోఎస్ స్వరూపరాణి పాఠశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పాఠశాల భవన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత ప్రభుత్వం రూ.4.5 కోట్లు పాఠశాల భవన నిర్మాణానికి మంజూరు చేసిందని గుర్తు చేశారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్వరగా పనులు పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘు, రతన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలపై దాడి హేయం



మాట్లాడుతున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: ఖమ్మంలో వరద ముంపు ప్రాంత ప్రజలను పరామర్శించడానికి వెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్‌ఎస్ యువజన కమిటీ నగర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులను భయపెడుతూ, దాడులు చేస్తూ ఉంటే చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మాజీ మంత్రి హరీష్‌రావు కారు పాక్షికంగా దెబ్బతినడంతో పాటు బీఆర్‌ఎస్ నేత సంతోష్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం అయితే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, నాయకులు బింగి నవీన్, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు రహీం, మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

దాడులకు హరీష్‌రావు భయపడడు : బీఆర్‌ఎస్ నేత నాగేష్‌ముదిరాజ్

ముషీరాబాద్: వరద బాధితులను పరామర్శించేందుకు ఖమ్మం వెళ్లిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు బృందంపై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని బీఆర్‌ఎస్ సీనియర్ నేత నాగేష్ ముదిరాజ్ తీవ్రంగా ఖండించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం... వారికి అండగా నిలబడటం ప్రజాప్రతినిధిగా కనీస బాధ్యత అని అన్నారు. అలా వరద బాధితులకు బాసటగా నిలబడేందుకు వెళ్లిన హరీష్‌రావు బృందంపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలకు సర్వస్వం కోల్పోయిన ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. దానిని కప్పిపుచ్చుకునేందుకు దాడులకు దిగడం పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. తక్షణం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అనుచరులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

భువనేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలోని భువనేశ్వరీ అమ్మవారికి శ్రావణ మాస పూజలు మంగళవారంతో ముగిశాయి. సందర్భంగా అమ్మవారిని పసుపు, చందనంతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయ ఈవో ఎం.దేవనాథం, ప్రధాన అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ పూజ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నేడు హుండీ లెక్కింపు...

నేడు బుధవారం వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం 9.30 గంటలకు హుండీ లెక్కింపు చేస్తున్నట్లు ఈవో ఎం.దేవనాథం తెలిపారు. మహిళా భక్త బృందం సభ్యులు, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

దివ్యాంగులకు అండగా నిలవాలి



ముషీరాబాద్: దివ్యాంగులకు అండగా నిలిచి వారిని అన్ని విధాలా ఆదుకోవాలని నార్త్ అమెరికన్ తెలుగు సొసైటీ కౌన్సిల్ మెంబర్ కిషోర్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని భవిత విద్యావనరుల కేంద్రంలో దివ్యాంగులకు స్పార్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, ఆట పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను చీదరించుకోకుండా చేరదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సీఈవో పంచముఖి, ప్రతినిధులు వివేక్, స్మిత, నాగేశ్వర్‌రావు, భవిత విద్యావనరుల కేంద్రం కోఆర్డినేటర్లు మల్లేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



చిక్కడపల్లి: వరుసగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని సూచన మేరకు ఆయన జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలసి డివిజన్‌లో పర్యటించారు. అశోక్‌నగర్, జవహర్‌నగర్, ధోబీఘాట్, జవహర్‌నగర్ తదితర ప్రాంతాలలో వరదనీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలించారు. నీరు సాఫీగా వెళ్లేలా పనులు చేయించారు. లోతట్టు ప్రాంత ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏలు రాజ్‌కుమార్, సోమేష్, శివకుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంగిలి మెతుకులకు ఆశపడకుండా
రాజ్యాధికారం కోసం పోరాడదాం



చిట్యాల ఐలమ్మ ప్రజా సంక్షేమ సంఘం ఆవిర్భావ సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చాకలి ఐలమ్మ చేసిన పోరాటం నేటికి స్ఫూర్తిదాయకమని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చిట్యాల ఐలమ్మ ప్రజా సంక్షేమ సంఘం ఆవిర్భావ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పాశం యాదగిరి మాట్లాడుతూ... ఇది ఒక పెద్ద పోరాటం కావాలని అన్నారు. తెలంగాణలో జరిగిన పోరాటాలు ఎక్కడా జరగలేదన్నారు. ప్రొ. ప్రభంజన్‌యాదవ్ మాట్లాడుతూ.. విస్నూరు రామచంద్రారెడ్డి దుర్మార్గాన్ని ఎదురించిన వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణలో మన రాజ్యాన్ని ఎందుకు తెచ్చుకోలేకపోతున్నామో అర్థం కావడం లేదన్నారు. విగ్రహాలను పెడితే సరిపోదని తిరుగుబాటు చైతన్యానికి నిదర్శనంగా ఉంటాయన్నారు. మన ఓటును మనమే వేసుకోవాలని.. మన రాజ్యాన్ని మనమే ఏలుకోవాలని హితవుపలికారు. ఎంగిలి మెతుకులకు ఆశపడకుండా రాజ్యాధికారానికై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఐలమ్మ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు చిట్యాల శ్వేత, ఐలమ్మ మనుమడు చిట్యాల రామచంద్రం, ప్రొఫెసర్ జంపన్న, ప్రొఫెసర్ రాములు, భూపతివెంకటేశ్వర్లు, బి.వి.కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట



గోల్నాక శాంతినగర్‌లో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

అంబర్‌పేట: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కావాల్సిన అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. మంగళవారం గోల్నాక డివిజన్ శాంతినగర్‌లో రూ.7 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను కార్పొరేటర్ దూసరి లావణ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దశలవారీగా పైపులైన్ వ్యవస్థను ఆధునీకరించేందుకు చొరువ తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. అనంతరం స్థానికంగా పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని ఆది లీలా ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీవాణి చందల్ పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రసాయనలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టితో తయారు చేసిన విగ్రహాలను తయారు చేస్తే పర్యావరణానికి ఎలాంటి విఘాతం కలగదన్నారు. ఈనెల 5న ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా నగరంలోని పలు ప్రాంతాల్లో కూడా మట్టి గణపతులను పంపిణీ చేస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మౌలానా ఆజాద్‌నగర్ బస్తీ దావాఖానాలో అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా

కాచిగూడ: ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయని, వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా సూచించారు. మంగళవారం కాచిగూడ, మౌలానా అజాద్‌నగర్ బస్తీలోని బస్తీ దవాఖానాను ఆమె సందర్శించి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరం, బీపీ, షుగర్, వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బస్తీ దవాఖానాల్లో ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కౌషిక్, కీర్తి, బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, మల్లికార్జున్, ఆర్.సంతోష్, ఓంప్రకాష్, వాసు, వంశి, సురేష్, రామకృష్ణ, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మేకల ముత్తన్న ఆశయ సాధన కృషి చేయాలి

కవాడిగూడ: షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ మేకల ముత్తన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమితి జాతీయ అధ్యక్షుడు ఎస్.రాజు పిలుపునిచ్చారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో మేకల ముత్తన్న సంతాప సభను మంగళవారం నిర్వహించారు. అంతకు ముందు లోయర్ ట్యాంక్‌బండ్‌లో ముత్తన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమితి అధ్యక్షుడిగా సేవలు అందించిన మేకల ముత్తన్న ఆశయాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు ఉచితంగా చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు జగన్నాథం, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ఉచిత చీరలు పంపిణీ చేస్తున్న రాజు ఉస్తాజ్ తదితరులు

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గెస్ట్ లెక్చరర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటలోపు కళాశాల కార్యాలయంలో లేదా కళాశాల మెయిల్ ద్వారా svsvidyanagar.ejkc@gmail.comలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆంగ్లంలో ఒకటి, అరబిక్‌లో ఒకటి, చరిత్రలో ఒకటి, రాజనీతి శాస్త్రంలో ఒకటి, బీబీఏ రిటేల్ ఆపరేషన్‌లో ఒకటి, వాణిజ్య శాస్త్రంలో రెండు, ఫైనాన్స్‌లో ఒకటి, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్‌లో రెండు, స్టాటిక్‌స్టిక్స్‌లో ఒకటి, డెటా సైన్స్‌లో ఒకటి, జువాలజీలో ఒకటి మొత్తం 13 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పీజీలో కనీసం 55 శాతం (ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం) సంబంధిత సబ్జెక్టుల్లో మార్కులు ఉండాలన్నారు. నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ లైన్ల పునరుద్ధరణ



రాంనగర్‌లో విద్యుత్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాంనగర్‌లోని హరినగర్, మేదర బస్తీ, అచ్చయ్యనగర్ తదతర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన విద్యుత్ అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. సమస్యను పరిష్కారం చూపిన ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

డస్ట్‌బిన్‌లో జాతీయ జెండా తోరణాలు

అంబర్‌పేట ట్రాఫిక్ ఠాణా ఆవరణలో ఘటన

అంబర్‌పేట: స్వాతంత్ర్య దినోత్సవం కోసం తీసుకొచ్చిన జాతీయ జెండా తోరణాలు అంబర్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోని డస్ట్‌బిన్‌లో దర్శనమిచ్చాయి. ఈ ఫొటో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించినట్లు సమాచారం.

రాష్ట్ర గ్రామ పంచాయతీ కారోబార్ అండ్ సిబ్బంది నూతన కార్యవర్గం



సమావేశంలో నూతన కమిటీ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్ అండ్ సిబ్బంది నూతన కార్యవర్గాన్ని మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాదుల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా వంగా రవీందర్, కార్యదర్శిగా పండి స్వామి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ హయాంలో కేటీఆర్ జీఓ నం.51 ద్వారా తమ బతుకులను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అరాచక పాలనకు విసిగెత్తి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీద తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేలా కృషి చేస్తా

మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా కృషి చేస్తానని తెలంగాణ మీడియా అకాడామీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ఇప్పటికే పలు మార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. త్వరలో కొత్త పాలసీ రూపకల్పన ద్వారా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్‌తో కలిసి పలువురు ప్రతినిధులు మంగళవారం మీడియా అకాడామీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని కలిసి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై చర్చించారు.

నిరుపేద జ్వరపీడితులకు లయన్స్‌క్లబ్ ఆర్థిక చేయూత



సాక్షి, హైదరాబాద్: ఇంటింటికి గంపలో పండ్లు తీసుకెళ్లి విక్రయించే నేరేడ్‌మెట్‌కు చెందిన అనురాధ కుటుంబంలో ఐదుగురు జ్వరాల బారిన పడ్డారు. తాజాగా ఆమె మనవరాలు టైఫాయిడ్‌తో బాధపడుతోంది. అంతా కష్టపడితే గాని పూటగడవని ఆ కుటుంబం ఇప్పుడు పూట గడవటమే కష్టంగా ఉంది. ముందులు కొనేందుకు కూడా మార్గం లేక అల్లాడుతోంది. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా జ్వరాలు చుట్టుముట్టడంతో ఇలాంటి నిరుపేద వర్గాల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఏరోజు సంపాదనతో ఆ రోజు నెట్టుకొచ్చే పేద కుటుంబాలను జ్వరాలు అల్లకల్లోలం చేస్తున్నాయి. ఒకరి నుంచి ఒకరికి సోకే వైరల్ జ్వరాలతో.. కుటుంబ సభ్యులంతా ఆసుపత్రి పాలు కావాల్సి వస్తోంది. ఇలాంటి నిరుపేదలకు లయన్స్‌క్లబ్ సభ్యులు అండగా నిలుస్తున్నాయి. నగరానికి చెందిన లయన్స్ క్లబ్ (ఎవరెస్ట్)హైదరాబాద్ అధ్యక్షులు జయకుమార్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జూలూరి రఘు, సహ కోశాధికారి జిల్లా రవీందర్, సుబ్బయ్య, అర్వింద్‌కుమార్ తదితరులు జ్వరాలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా రూ.3 వేల నుంచి రూ.4,500 చొప్పున అందజేశారు. తాము సొంతంగా నిధులు సమీకరించుకుని జ్వరపీడిత కుటుంబాల్లో కొందరికి నగదు, కొందరు నిత్యావసర వస్తువులు, అవసరమైన వారికి మందులు అందజేస్తున్నట్లు సహ కోశాధికారి జిల్లా రవీందర్ తెలిపారు.

ఉద్యమం, సంక్షేమ పథకాలపై పట్టు పెంచుకోవాలి

టీజీపీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొ. గంటా చక్రపాణి



గ్రూప్–1 మెయిన్స్ మేధో మథనం అవగాహన సదస్సుకు హాజరైన పోటీ పరీక్షల అభ్యర్థులు



మాట్లాడుతున్న ప్రొ. గంటా చక్రపాణి

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభలో మంగళవారం 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్స్ మేధో మథనం అవగాహన సదస్సు నిర్వహించారు. టీజీపీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొ. గంటా చక్రపాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఏర్పాటు అమలవుతున్న సంక్షేమ పథకాల పట్ల సమగ్ర అవగాహన పెంచుకోవాలని సూచించారు. పరీక్ష సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ప్రశ్నలను అర్థం చేసుకొని ఏ విధంగా రాయాలో తెలిపారు. 21 ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రదీప్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో టీజీపీఎస్సీ సిలబస్ కమిటీ సభ్యులు ప్రొ. అడపా సత్యనారాయణ, ప్రొ. చింతా గణేష్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. మామిడి హరికృష్ణ, పత్రిక సంపాదకుడు కె.శ్రీనివాస్, పోటీ పరీక్షల పుస్తక రచయిత డా. సత్యనారాయణ, అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.